సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 19 । నవంబర్ । 2022



'గడప గడపకు'
గిరిజనుల నీరాజనం 10లో

- మావోయిస్టుల కోటలోని గ్రామాల్లో ఎంపీ మాధవి, ఎమ్మెల్యే పాల్గుణ పర్యటన



గెడ్డలు దాటి.. కొండలు ఎక్కి

ముంచంగిపుట్టు మండలం మారుమూల బరడ, లక్ష్మీపురం, బుంగాపుట్టు గ్రామాలకు ఎంపీడీవో కిరణ్‌కుమార్ కొండలెక్కి, గెడ్డను దాటి చేరుకున్నారు. 10లో

గిరిజన పోరాటయోధుల త్యాగాలు చిరస్మరణీయం 10లో

పోరాటయోధుల త్యాగాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు పిలుపునిచ్చారు.



కాబోయే అమ్మలకు ఆలంబనగా..

- మాతాశిశు మరణాలపై ప్రత్యేక దృష్టి
- గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ
- 2,737 మందిలో రక్తహీనత గుర్తింపు
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్‌లో పౌష్టికాహారం పంపిణీ
- వారి ఆరోగ్యంపై నిత్యం పర్యవేక్షణ

జిల్లాలో మాతాశిశు మరణాల నివారణపై ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించింది. రక్త హీనత నివారించేందుకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ ద్వారా సంపూర్ణ పౌష్టికాహారాన్ని అందించడమే కాకుండా నిత్యం వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తోంది.

రంపచోడవరం: జిల్లాలో మాతా శిశుమరణాలు అరికట్టేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకం సత్ఫలితాలనిస్తోంది. సాధారణంగా ఏజెన్సీలో తగిన పౌష్టికాహార సమస్య కారణంగా గర్భిణులు, బాలింతలు, శిశువుల్లో రక్తహీనత ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ఈ కారణంగానే ప్రసవ సమయంలో మాతా శిశు మరణాలు సంభవిస్తున్నాయి. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం పౌష్టికాహార పంపిణీపై దృష్టి సారించింది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, శిశువుల్లో రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి తక్షణ చర్యలు చేపడుతోంది. సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు సిబ్బంది దృష్టి పెడుతున్నారు. అంగన్‌వాడీ కార్యకర్త వ్యక్తిగతంగా పరిశీలించి వారి వివరాలు ప్రతి రోజూ ఫొటో తీసి వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇలా ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో రక్తహీనతతో ఉన్న గర్భిణుల వివరాలు ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి వెళ్తున్నాయి. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నుంచి డైరెక్టర్ వరకు రక్తహీనతతో బాధ పడుతున్న గర్భిణుల పరిస్థితిపై పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో 5641 మంది గర్భిణులు ఉండగా వారిలో 2,737 మంది రక్తహీనతతో బాధపడుతున్నారు.

నెలలో 25 రోజులపాటు..

గర్భిణులు, బాలింతలకు నెలలో 25 రోజులపాటు వేడి పాలు, అన్నం, పప్పు, కూరగాయలు, ఆకుకూరలు, గుడ్లు అందజేస్తున్నారు. టేక్ హోమ్ న్యూట్రిషన్ కిట్ కింద నెలకు 2 కిలోల మల్టీ గ్రెయిన్ ఆటా, అర కిలో వేరుశనగ చిక్కీ, అర కిలో రాగి పిండి, అర కిలో బెల్లం, అరకిలో ఎండు ఖర్జూరం పంపిణీ చేస్తున్నారు. రక్తహీనత ఉన్న గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రానికి వస్తున్నారా, ఆహారం తిన్నారా, ఐరన్ మాత్రలు మింగారా అనేది పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. అలాగే రక్తహీనతతో బాధ పడుతున్న వారి ఇంటికి అంగన్‌వాడీ సీడీపీవోలు, సిబ్బంది వెళ్లి వారికి వ్యక్తిగతంగా రక్తహీనతను దూరం చేసేందుకు అవగాహన కల్పిస్తున్నారు.

చిన్నారులకు..

36 నుంచి 72 నెలల లోపున్న చిన్నారులకు నెలలో 25 రోజులపాటు వేడి అన్నం, పప్పు, కూరగాయలు, ఆకుకూరలతోపాటు 200 మిల్లీ లీటర్ల పాలు, కోడిగుడ్డు, 50 గ్రాముల బాలామృతం లడ్డూ ఇస్తున్నారు. ఒక్కొక్కరికి రూ.553 చొప్పున ఖర్చు చేయనున్నారు. 6 నుంచి 36 నెలల లోపున్న చిన్నారులకు టేక్ హోం న్యూట్రిషన్ కిట్ కింద నెలకు 2.5 కిలోల బాలామృతం, 30 కోడి గుడ్లు, 6 లీటర్ల పాలు అందించనున్నారు. ఒక్కొక్కరిపై నెలకు రూ.620 చొప్పున వెచ్చిస్తోంది.



రక్తహీనత గల గర్భిణుల ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న సీడీపీవో సంధ్య, అంగన్‌వాడీ కార్యకర్త

ఐటీడీఏల వారీగా సమాచారం

పాడేరు..	రంపచోడవరం..	చింతూరు..
గర్భిణులు : 3747	గర్భిణులు : 1345	గర్భిణులు : 549
రక్తహీనత : 1832	రక్తహీనత : 645	రక్తహీనత : 260

జిల్లాలో 5641 మంది గర్భిణులు ఉండగా వారిలో 2,737 మంది రక్తహీనతతో బాధపడుతున్నారు.

ప్రతీ రోజు మాట్లాడుతున్నారు



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేశామా లేదా, ఆరోగ్యం ఎలా ఉంది అంటూ ప్రతీ రోజు మాట్లాడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేసిన తరువాత ఫొటో తీసుకుంటున్నారు. ఇంటికి కూడా వచ్చి ఎలాంటి ఆహారం తీసుకోవాలి, ఏ జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తున్నారు. దీనివల్ల రక్తహీనత నుంచి బయటపడేందుకు అవగాహన పొందుతున్నాం.

–మడకం రమ్య, బి.వెలమలకోట, రంపచోడవరం మండలం

పూర్తిస్థాయిలో పర్యవేక్షణ



గర్భిణిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు అయిన తరువాత వారు ఆరోగ్యంగా ఉండేందుకు అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తలు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నారు. రక్తహీనత దూరం చేసి ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిచ్చేందుకు పౌష్టికాహారం అందిస్తున్నాం. అంగన్‌వాడీ ద్వారా పూర్తి స్థాయి పర్యవేక్షణ ఉంటోంది. సరైన ఆహార నియమాలు పాటించకపోవడం, స్త్రీలలో అధిక రక్తస్రావం, కుటుంబ నియంత్రణ పాటించకపోవడం, బిడ్డకి బిడ్డకి తగినంత వ్యవధి లేకుండా ప్రసవాలు జరగడం రక్తహీనతకు కారణమవుతోంది,

–సంధ్యారాణి, సీడీపీవో, రంపచోడవరం

న్యూస్‌రీల్

వృద్ధుల కోసం హెల్ప్‌లైన్ సేవలు

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర అధికారులు

సాక్షి,పాడేరు: వృద్ధులకోసం ఏర్పాటుచేసిన హెల్ప్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ కోరారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో జాతీయ వృద్ధుల హెల్ప్‌లైన్ 14567 పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. సమాచారం, భావోద్వేగ సహాయం ,తల్లిదండ్రులు–వృద్ధుల చట్టాలు, వ్యక్తిగత, కుటుంబ సమస్యలపై న్యాయ సలహాలు, సూచనలు, క్షేత్ర స్థాయిలో సహాయానికి హెల్ప్ లైన్ సేవలు పొందవచ్చన్నారు. హెల్ప్ లైన్ 14567 పై వృద్ధులకు జిల్లా యంత్రాంగం అవగాహన కల్పించాలన్నారు. గ్రామసచివాలయాల ద్వారా ప్రచారం చేపట్టాలని సూచించారు. సబ్ కలెక్టర్ వి.అభిషేక్, డీఆర్వో బి.దయానిధి, జాతీయ వృద్ధుల దివ్యాంగులు– వయోవృద్ధుల శాఖ సిబ్బంది కె.అప్పలనాయుడు, ఎఫ్ఆర్వో ఏ. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోఆర్డినేటర్ పోస్టులకు ఇంటర్వ్యూలు రేపు

ఎటపాక: అభి హెల్ప్‌లైన్, ఎడ్యుకేషనల్ సొసైటీ సహకారంతో మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో అక్షర వెలుగు ఉచిత విద్యా బోధన కోఆర్డినేటర్ల నియామకానికి ఈనెల 20న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మండల కోఆర్డినేటర్ ఎం.గంగరాజు తెలిపారు. నెల్లిపాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు టెన్త్, ఇంటర్ ధ్రువీకరణ పత్రాలతో పాటు రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలని కోరారు. వివరాలకు 9493465126, 9553463102 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

పాడేరు డివిజన్‌లో ఎయిర్‌టెల్ సేవలు

- యుద్ధప్రాతిపదికన వందకు పైగా టవర్ల నిర్మాణం
- ఇండస్ ఎస్టేట్ మేనేజర్ రఫీ



కొయ్యూరు: పాడేరు డివిజన్‌లో ఎయిర్‌టెల్ సేవలు త్వరితగతిన అందించేందుకు పనులు వేగంగా జరుగుతున్నాయని ఇండస్ ఎస్టేట్ మేనేజర్ రఫీ తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని యూ.చీడిపాలెం, పలకజీడి గ్రామాలకు విచ్చేశారు. మర్రిపాకలకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. అక్కడ త్వరలో ఏర్పాటు చేయబోతున్న టవర్‌కు అవసరమైన స్థలాన్ని పరిశీలన చేశారు. పాడేరు డివిజన్‌లో వందకు పైగా టవర్ల నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. కొయ్యూరు మండలంలో 18 టవర్లు నిర్మిస్తున్నట్టు ఆయన వివరించారు. దీనిలో భాగంగా రేవులకోట, పుట్టకోట,బూదరాళ్ల, మర్రిపాకల,యూ.చీడిపాలెం తదితర ప్రాంతాల్లో సంక్రాంతి నాటికి టవర్లు ప్రారంభిస్తామని చెప్పారు. టవర్లకు కేబుల్ ద్వారానే సిగ్నల్ వస్తుందని చెప్పారు. ఇప్పటికే కేబుల్ నిర్మాణ పనులు చేపట్టామని ఆయన వివరించారు. పలకజీడి సర్పంచ్ రవేష్ పాల్గొన్నారు.

విద్యుత్ తీగలతో అడవి పందుల వేట

తరచూ సరఫరాకు అంతరాయం

కొయ్యూరు: విద్యుత్ తీగలతో అడవి పందుల వేటాడటం వల్ల తరచూ యూ.చీడిపాలెం పంచాయతీలోని పలకజీడికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. రాత్రయితే చీకట్లో మగ్గాల్సి వస్తోంది. పలకకజీడికి విద్యుత్ సరఫరా వై.రామవరం మండలం జంగాలతోట నుంచి వస్తుంది. అయితే గడచిన పది రోజుల నుంచి ఆ ప్రాంతంలో కొందరు రైతులు అడవి పందుల కోసం విద్యుత్ వైర్లతో కంచె ఏర్పాటు చేస్తున్నారు. దీంతో రాత్రి వేళల్లో సరఫరా నిలిచిపోతోంది. దీనిపై ఆశాఖ ఉన్నతాధికారులు స్పందించి అడవి పందుల వేటకు విద్యుత్ కంచెను అమర్చుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

- ప్రభుత్వం తరఫున రూ.లక్ష ఆర్థికసాయం
- మృతుడి తండ్రికి ఔట్ సోర్సింగ్‌లో ఉద్యోగం
- కలెక్టర్ సుమిత్ కుమార్ హామీతో ఆందోళన విరమణ
- ఎట్టకేలకు మృతదేహానికి పోస్టుమార్టం
- కేసు విచారణ వేగవంతం : ఎస్‌ఐ



ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తున్న మృతుని కుటుంబాలు,విద్యార్థి సంఘాల నేతలు

సాక్షి, పాడేరు: ఆశ్రమ విద్యార్థి పాంగి నవీన్ అనుమానాస్పద మృతికి సంబంధించి కుటుంబ సభ్యులు, విద్యార్థి, గిరిజన సంఘాలు చేపట్టిన ఆందోళనను కలెక్టర్ సుమిత్ కుమార్ హామీతో శుక్రవారం మధ్యాహ్నం విరమించారు. విద్యార్థి మృతికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, హత్యకోణంలో పోలీసులు విచారణ జరిపి, నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, గిరిజన సంఘాలు, బాధిత కుటుంబం ఐటీడీఏ ఎదుట ధర్నా చేశాయి. విద్యార్థి మృతదేహానికి శవపరీక్షను వారంతా అడ్డుకున్నారు. దీంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పందించారు.ఆందోళనకారులు, విద్యార్థి తండ్రి మహేంద్ర, ఇతర కుటుంబ సభ్యులతో ఆయన చర్చలు జరిపారు. పోలీసు అధికారులతో విచారణ జరుపుతున్నామని, అలాగే బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపును రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. అంతేకాకుండా అవుట్ సోర్సింగ్‌లో విద్యార్థి తండ్రి మహేంద్రకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని ఆయన హామీ ఇవ్వడంతో మధ్యాహ్నం రెండు గంటలకు వారంతా ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా పాడేరు ఎస్‌ఐ లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థి నవీన్ అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశామన్నారు. శవపరీక్షలు నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని పాడేరు సీఐ సుధాకర్, ఎస్‌ఐలు లక్ష్మణ్, రంజిత్ సమక్షంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం అంబులెన్సులో స్వగ్రామం సుర్లంపాలెం తరలించారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- స్పందనకు ఆలస్యంగా వచ్చిన అధికారులపై ఆగ్రహం
- 20 మందికి షోకాజ్ నోటీసుల జారీ



గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: పాడేరు ఐటీడీఏలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి జిల్లా అధికారులు నిర్దిష్ట సమయానికి హాజరు కావాలని కలెక్టర్ సమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఐటీడీఏలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన స్పందనకు ఆలస్యంగా వచ్చిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.సమయపాలన పాటించని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. 20 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు ప్రతినెలా స్పందన అర్జీలపై సమీక్షిస్తున్నారన్నారు. వాటి పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. స్పందనపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్పందనకు వివిధ మండలాలకు చెందిన వారినుంచి 105 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ వి.అభిషేక్, డీఆర్వో బి.దయానిధి, ఐటీడీఏ ఏపీవో వి.ఎస్.ప్రభాకరరావు, గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఐ.కొండలరావు, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవిఆర్ఎం.రాజు, రహదారులు భవనాల శాఖ ఈఈ బాల సుందర బాబు, పంచాయతీరాజ్ ఈఈ కె.లావణ్య కుమార్, పీఆర్ ఈఈ కొండయ్య పడాల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ బాషా, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మన్యం గజగజ

- రోజురోజుకు పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- అరకులోయలో 9..
- చింతపల్లిలో 9.4..
- మినుములూరులో 10 డిగ్రీలు నమోదు



అరకులోయలో దట్టంగా కురుస్తున్న మంచు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో చలితీవ్రతకు మన్యంవాసులు వణికిపోతున్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచే చలిగాలుల ఉధృతి కనిపిస్తోంది. ఉపశమనం పొందేందుకు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు. అరకులోయ కేంద్ర కాఫీబోర్డు వద్ద 9డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 9.4 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 10 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు శుక్రవారం నమోదయ్యాయి.

రెడ్ క్రాస్ సొసైటీ అంబులెన్సు ప్రారంభం



జెండా ఊపి అంబులెన్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్,సబ్‌కలెక్టర్ అభిషేక్‌లు

సాక్షి,పాడేరు: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖకు ఢిల్లీ రెడ్ క్రాస్ అందుబాటులోకి తెచ్చిన నూతన అంబులెన్సును జెండా ఊపి కలెక్టర్ సుమిత్ కుమార్, సబ్ కలెక్టర్ అభిషేక్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తం అవసరాలకు, అత్యవసరమైన పరిస్థితుల్లో అంబులెన్సును ఉపయోగించాలని సూచించారు. శ్రీకాకుళం రెడ్ క్రాస్ ఇచ్చిన అంబులెన్స్‌ను, మహాప్రస్థానం సేవలకు ఉపయోగించాలని సూచించారు. పేదలకు మహాప్రస్థానం వాహనం అవసరమైనప్పుడు 7569982899, 6303841383 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో బి.దయానిధి, జిల్లా రెడ్ క్రాస్ సెక్రటరీ ఈశ్వరరావు, ట్రెజరర్ టి.అప్పారావు, జిల్లా ఉన్నతాధికారులు, మేనేజింగ్ కమిటీ మెంబర్లు గౌరీశంకర్ లోహితాస్, సూర్యారావు, సతీష్, సింహాచలం, కోఆర్డినేటర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కుమ్మరిపుట్టు వంతెన నిర్మాణానికి వినతి



ఎంపీ మాధవికి వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శుక్రవారం పర్యటించిన అరకు ఎంపీ గొడ్డేటి మాధవిని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర సమక్షంలో సుజనకోట పంచాయతీ ఎంపీటీసీ భర్త దామోదరం, పార్టీ మండల నేతలు జేవీవీఎస్ మూర్తి, జి.బాబురావు కలిశారు. సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు వద్ద మత్స్యగెడ్డపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ మాధవి, వంతెన నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

జగనన్న క్రీడా సంబరాల పోస్టర్ ఆవిష్కరణ



జగనన్న క్రీడా సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి.



పాడేరు కలెక్టరేట్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, సబ్‌కలెక్టర్ అభిషేక్

సాక్షి,పాడేరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు పురస్కరించుకుని వచ్చే నెల 21న నిర్వహించనున్న జగనన్న క్రీడా సంబరాలను విజయవంతం చేయాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి కోరారు. స్థానిక పీఎంఆర్‌సీ భవనం ఆవరణలో శుక్రవారం క్రీడా సంబరాల ప్రచార పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ రాష్ట్ర క్రీడాసాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ పోటీలను నియోజకవర్గ,జిల్లా స్థాయిలో నిర్వహించి ప్రతిభావంతులను వెలికితీయాలని సూచించారు.

కలెక్టరేట్‌లో..

జగనన్న క్రీడా సంబరాలకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఐటీడీఏ సమావేశమందిరంలో ఆవిష్కరించారు. క్రీడా పోటీలను జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సబ్‌కలెక్టర్ అభిషేక్, జిల్లా క్రీడల అధికారి జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

- జాబ్స్ జిల్లా మేనేజర్ కల్యాణి జగదీశ్వరి
- వివిధ ఉద్యోగాలకు 160 మంది ఎంపిక



అవగాహన కల్పిస్తున్న కల్యాణి జగదేశ్వరి, సంస్థ ప్రతినిధులు

అరకులోయ రూరల్: నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పనే లక్ష్యమని జాబ్స్ జిల్లా మేనేజర్ కల్యాణిజగదీశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వైటీసీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏపీఎస్ఎస్‌డీసీ, డీఆర్‌డీఏ, సీడాప్, వెలుగు ఆధ్వర్యంలో శుక్రవారం17 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు మెగా జాబ్‌మేళా నిర్వహించారు. వివిధ కేటగిరీలకు చెందిన 1120 ఉద్యోగాలకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 304 మంది హాజరయ్యారు. వీరిలో 160 మందిని ఎంపిక చేసినట్టు జాబ్స్ జిల్లా మేనేజర్ కల్యాణిజగదీశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్‌ఐ సంతోష్, ఎఫ్‌సీ మేనేజర్ శేఖర్, జాబ్ కోఆరినేటర్ల శ్యామ్, బొజ్జన్న, వెంకటరావు, శివప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్, వైస్ ప్రిన్సిపాల్ పట్టాసి చలపతి పాల్గొన్నారు.

ఏడాదిగా తప్పించుకుని తిరుగుతూ..

వేర్వేరు కేసుల్లో చిక్కిన ఇద్దరు గంజాయి నిందితులు



నిందితుడితో గూడెంకొత్తవీధి పోలీసులు



నిందితుడిని అరెస్టు చేసిన అరకు పోలీసులు

గూడెంకొత్తవీధి: గంజాయి కేసులో ఏడాది కాలంగా తప్పించుకుని తిరుగుతున్న ప్రధాన నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసినట్టు సీఐ అశోక్‌కుమార్ వెల్లడించారు. 2021లో స్థానిక పోలీసుస్టేషన్‌లో నమోదైన గంజాయి కేసులో ప్రధాన నిందితుడైన దుప్పిలవాడ పంచాయతీ రాళ్ళగెడ్డకు చెందిన ప్రదాని గోవర్దన్ అప్పటినుంచి తప్పించుకుని తిరుగుతున్నాడు. అతని కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు పథకం ప్రకారం పట్టుకుని అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. ఎస్‌ఐ అప్పలసూరి, సిబ్బంది పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: గంజాయి కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్‌ఐ సంతోష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో పెదలబుడు పంచాయతీ కేంద్రానికి చెందిన ఎల్‌బీ రామారావు 2021లో గంజాయి తరలిస్తూ పట్టుబడిన కేసులో ముద్దాయి అన్నారు. అప్పటినుంచి తప్పించుకుని తిరుగుతున్న అతనిని పట్టుకుని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

గిరిజన రైతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే


సమీక్షలో మాట్లాడుతున్న పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలోని గిరిజన రైతులు అభివృద్ధి చెందే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశ పెట్టడం జరిగిందని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే అన్నారు. ఐటీడీఏ సమావేశపు హాలులో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వెలుగు, వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా గిరిజన రైతులకు జాతీయ గ్రామీణ జీవన ఉపాధి మిషన్ ద్వారా గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు కోళ్ల పెంపకం, మిల్క్ డైయిరీ, జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్లు , చేపల పెంపకంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులు అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో భాగంగా ఏజెన్సీలో ఐదు గ్రామాలను ఒక యూనిట్‌గా ఏర్పాటు చేసి ప్రతి కుటుంబం జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు ప్రతిపాదనలు అందజేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా సుమారు 300 మంది గిరిజన రైతులకు రూ.40 లక్షల వరకు రుణాలు మంజూరుకు అనుమతులు న్నాయన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ చేసి మార్కెటింగ్ చేసే విధంగా గ్రామాల్లో సభ్యులను ఎంపిక చేయాలని సూచించారు. అటవీ ఉత్పత్తుల కోసం కోల్డ్ స్టోరేజీ వాహనం కోసం ఒక యూనిట్‌గా ఏర్పడిన సభ్యులకు రుణాలు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. ఈ మేరకు లబ్ధిదారులు రూ.1లక్ష రుణం కోసం రూ.10వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతుల సంఘాలు, అధికారులతో సమీక్షించారు. ఏపీడీ శ్రీనివాసరావు, ఏపీఎంలు అపర్ణ, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

మస్తర్లు అప్‌లోడ్ చేయాలి

ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన మస్తర్లు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని పీవో సూరజ్ గనోరే ఆదేశించారు. సమావేశపు హాలులో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి వంద రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. జాబ్ కార్డులపై ఆరా తీశారు. ఉపాధి పనులపై గ్రామ సభల్లో తీర్మానం చేయాలని సూచించారు.

ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దాలి


మొక్క నాటుతున్న డీఎల్‌పీవో కుమార్

చింతపల్లి: మండల కేంద్రంలో డీఎల్‌పీవో కుమార్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పంచాయతీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. చెత్త నుంచి సంపద కేంద్రాలను ఆయన పరిశీలించారు. 15 ఆర్థి సంఘం నిధులను నిబంధనల ప్రకారం ఖర్చు చేయాలన్నారు.పన్నుల వసూల్లో పంచాయతీ సిబ్బంది చురుగ్గా వ్యవహరించాలని ఆయన సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చింతపల్లి గ్రామ పంచాయతీను ప్రజాప్రతినిధులు, అధికారులు సహకారంతో ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయాభివృద్ధే లక్ష్యం

కలెక్టర్ సుమిత్‌కుమార్


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ సరస్వతి

సాక్షి, పాడేరు: జిల్లాలో వ్యవసాయాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్‌లో వ్యవసాయ సలహా సంఘం సమావేశాన్ని ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24కు సంబంధించి రూ.1946.10 కోట్లతో పొటన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ అమలు చేస్తున్నామని తెలిపారు. దీనిలో వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలకు అవకాశమిస్తామన్నారు. ఏజెన్సీలో వరిపంట కోతలు ప్రారంభమైనందున రబీ రెండవ పంటకు గిరిజన రైతులను ప్రోత్సహించాలని సూచించారు. బెంగాల్ గ్రామ్ విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేస్తామన్నారు. ఆవాలు, కూరగాయల సాగు విస్తీర్ణం పెంపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కాఫీ గింజలకు గిట్టుబాటు ధర కల్పించి, దళారీ వ్యవస్థ లేకుండా చూడాలని ఆదేశించారు. సాంకేతిక సమస్యలు పరిష్కరించి పెండింగ్‌లో ఉన్న 4900 మందికి రైతు భరోసా వర్తింపజేయాలని సూచించారు. జిల్లా వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షురాలు సరస్వతి, నాబార్డు డీజీఎం శ్రీనివాసరావు, ఎల్‌డీఎం రవితేజ, జిల్లా వ్యవసాయ, ఉద్యానవనశాఖాధికారులు నంద్, రమేష్, మార్కెటింగ్ ఏడీ రాకేష్, డీఆర్‌డీఏ పీడీ మురళీ, వ్యవసాయ శాస్త్రవేత్త సందీప్ తదితరులు పాల్గొన్నారు.

‘గడప గడపకు’ గిరిజనుల నీరాజనం

- మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో ఎంపీ మాధవి, అరకు ఎమ్మెల్యే పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర పర్యటన
- గిరిజనుల ఘన స్వాగతం
- మళ్లీ జగనన్న పాలన కావాలని గ్రామస్తుల ఆకాంక్ష


ఎంపీ మాధవి, ఎమ్మెల్యే పాల్గుణ,చైర్ పర్సన్ సుభద్రలకు పూలమాలలతో స్వాగతం పలుకుతున్న గిరిజనులు

పెదబయలు: ఎన్నడూ లేని విధంగా ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు వచ్చేస్తున్నాయి.. మధ్యవర్తి లేకుండా ఖాతాల డబ్బులు జమ అవుతున్నాయి.. గ్రామ సచివాలయంలో సిబ్బంది జవాబుదారీతనంగా పని చేస్తున్నారు.. అందుకే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి అవ్వాలి.. మాకు ఈ పాలనే కావాలని గిరిజనులు.. గ్రామాల్లో పర్యటించిన అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్రల ఎదుట అన్నమాటలివి.. మండలంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన జామిగూడ పంచాయతీ కేంద్రంతో పాటు గుంజివాడ గ్రామాల్లో శుక్రవారం ఉదయం 11 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమైంది. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్రలు అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 250 గడపలను సందర్శించారు. గ్రామాల్లో వారికి గిరిజనులు ఘన స్వాగతం పలికారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బ్రోచర్‌ను గ్రామస్తులకు అందజేశారు.

పార్టీలకతీతంగా జగనన్న పాలన

ఈ సందర్భంగా అరకు ఎంపీ గొడ్డేటి మాధవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో కుల, మత, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రతి గ్రామానికి రోడ్డు, తాగునీరు, వైద్యం, విద్య, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో మరింత వేగంగా, పారదర్శకంగా అమలుచేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రి చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ స్థాయిలోనే అధికారులు అందుబాటులో ఉండడంతో పాటు చెంతకే పథకాలు అందడం హర్షణీయమన్నారు. వలంటీర్ల, సచివాలయ సిబ్బంది సేవలను వినియోగించుకొని పథకాలు పొందాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల అభ్యున్నతి కోసం విశేష కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపీపీ వరహాలమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జె.సూర్యనారాయణ, పార్టీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, అగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ సన్యాసి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కె.సురేష్, మండల పార్టీ అధ్యక్షుడు వి.ఆనందరావు, సర్పంచ్ అన్నమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు నిర్మల, నాయకులు సూరయ్య, బాలరాజు, సింహాచలం, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోట్ వర్కర్ మృతిపై కేసు నమోదు

వీఆర్‌పురం: మరమ్మతులు జరుగుతున్న బోటులో పనిచేస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తూ మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ టి.దుర్గాప్రసాద్ కథనం మేరకు వివరాలిలావున్నాయి. పోచవరం బోట్‌పాయింట్ వద్ద మరమ్మతులు జరుగుతున్న బోట్‌లో వడ్డిగూడెం గ్రామానికి చెందిన శివగిరి భవానీశంకర్ (24) వారంలోజుల క్రితం పనిలో చేరాడు. ఈ క్రమంలో గురువారం కూడా పనికి వెళ్లాడు. బోట్‌లో పనిజరుగుతున్న ప్రదేశంలో ఒక్క సారిగా కుప్పకూలి పడిపోయాడు. దీంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసుల సహకారంతో ఇతర బోట్ సిబ్బంది అతడిని ఆటోలో రేఖపల్లి పీహెచ్‌సీకి తరలించే ప్రయత్నం చేశారు. అతడు మార్గం మధ్యలోనే ప్రాణాలు విడిచాడు. మృతుడు తండ్రి రాజారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. ఇలావుండగా బోటులో ప్రమాదవశాత్తూ మృతిచెందిన భవానీశంకర్ కుటుంబాన్ని బోట్ యాజమాన్యం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పూనెం సత్యనారాయణ, ఎంపీపీ కారం లక్ష్మి శుక్రవారం రేఖపల్లిలో నిర్వహించిన సమావేశంలో డిమాండ్ చేశారు.

గెడ్డలు దాటి.. కొండలు ఎక్కి

ముంచంగిపుట్టు: మండలంలోని మారుమూల బరడ, లక్ష్మీపురం, బుంగాపుట్టు గ్రామాల్లో ఎంపీడీవో ఎస్.కిరణ్‌కుమార్ శుక్రవారం పర్యటించారు. ఇందులో భాగంగా బిరిగూడ, కొజిరిగూడ గెడ్డలను దాటి, కొండలు ఎక్కి గ్రామాలకు చేరారు. ఆయా గ్రామ సచివాలయాల్లో రికార్డులు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వారు తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్‌లో సంతకాలు చేయాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామాల్లోని నాడు–నేడు ద్వారా జరుగుతున్న పనులను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. స్థానికులు ఎంపీడీవోను కలిసి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వివరించారు.

23న ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం

అనకాపల్లిటౌన్: ప్రొహిబిషన్ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఈనెల 23వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎస్పీ గౌతమిసాలి శుక్రవారం పేర్కొన్నారు. జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్‌లలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 126 ద్విచక్రవాహనాలు, 12 ఆటోలు, ఒక కారు ఎంవీఐ నిర్ధారించిన ధర నుంచి వేలంపాట ప్రారంభమవుతుందని ఆమె తెలిపారు. వాహనాలను పాడుకున్న వ్యక్తులు జీఎస్టీ చెల్లించాలని, రూ.5వేలు చెల్లించి పాటకు హాజరుకావాలని ఆమె కోరారు.

ఏజెన్సీలో సెల్‌టవర్ల ఏర్పాటుకు చర్యలు

రాజవొమ్మంగి: మండలవ్యాప్తంగా 16 సెల్ టవర్లు నిర్మించేందుకు ఎయిర్‌టెల్ సంస్థ ముందుకు వచ్చినట్టు తహసీల్దార్ వై.వి.సుబ్రహ్మణ్యాచారి చెప్పారు. ఇప్పటికే శరభవరం, అనంతగిరి గ్రామాల్లో పనులు జరుగుతున్నాయన్నారు. అన్ని ప్రాంతాల్లో టవర్లు ఏర్పాటుకానున్నట్టు చెప్పారు. బీఎస్ఎన్ఎల్ ద్వారా మండలంలోని 40 టవర్లు నిర్మాణానికి అవసరమైన స్థలాల సర్వే జరుగుతుందన్నారు. అల్లూరి జిల్లాకు ఎయిర్‌టెల్ సంస్థ తరపున 142 టవర్లు ఏర్పాటుచేయనున్నట్టు ప్రతినిధులు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 211 టవర్లు నిర్మిస్తున్నామని, అల్లూరి జిల్లాకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. నాణ్యమైన సెల్, ఇంటర్నెట్ సేవలందించడమే లక్ష్యమన్నారు.

గిరిజన పోరాటయోధుల త్యాగాలు చిరస్మరణీయం

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి


మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి, పాడేరు: గిరిజన వీరులు, స్వాతంత్య్ర పోరాట యోధుల త్యాగాలను గిరిజన యువత ఆదర్శంగా తీసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. గిరిజన ఆత్మ గౌరవ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం స్వచ్ఛతా ర్యాలీని పాడేరులో ఘనంగా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వాతంత్ర సమరయోధుడు బిర్సా ముండా జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా శుక్రవారం అంబేడ్కర్ జంక్షన్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు చేపట్టిన స్వచ్ఛతా ర్యాలీని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాల మేరకు ఈ నెల 15న ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న చేతుల మీదుగా విశాఖలో గిరిజన జాతీయ గౌరవ దినోత్సవం వేడుకలను ప్రారంభించినట్టు తెలిపారు. గిరిజన వీరుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. పాడేరు పాతబస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్.ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వరరావు, గిరిజనే సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఐ.కొండలరావు, డీఎల్‌పీవో పి.ఎస్.కుమార్, ఎంపీడీవో కె.సాయినవీన్, సహాయ గిరిజన సంక్షేమ అధికారి ఎల్.రజిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


రంపచోడవరంలోని ర్యాలీలో పాల్గొన్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు మరువలేనివి: ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: దేశ స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు మరువలేనివని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. ఐటీడీఏ కార్యాలయం నుంచి శుక్రవారం గిరిజనుల ఆత్మ గౌరవ ఉత్సవాల ర్యాలీని ఆయన ప్రారంభించారు. పీవో మాట్లాడుతూ విశాఖపట్నంలో నిర్వహించే గిరిజనుల ఆత్మగౌరవ ఉత్సవాలకు గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ఇతర పాఠశాలల నుంచి 130 మంది విద్యార్థులను ఎంపిక చేసి పంపడం జరిగిందన్నారు. ఈ నెల 21న ఈ ఉత్సవాలకు సంబంధించి ర్యాలీలు ప్రజాప్రతినిధులతో నిర్వహించి పాఠశాలల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సాహించాలన్నారు. డీడీ సీహెచ్.శ్రీనివాసరావు, లైజన్ అధికారి బిఎస్ కుమార్ తదిరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా అక్కాచెల్లెల గుమ్మి జలపాతం

పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి


జలపాతం వద్ద పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: మండలంలోని సొలభం పంచాయతీలో వై.కంఠవరం గ్రామ సమీపంలోని అక్కాచెల్లెల గుమ్మి జలపాతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె జలపాతం ప్రాంతాన్ని సందర్శించారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్థానికుల నుంచి తెలుసుకున్నారు. అక్కాచెల్లెల గుమ్మి జలపాతంగా పేరు రావడానికి ప్రచారంలో ఉన్న సమాచారాన్ని గిరిజన పెద్దలు ఎమ్మెల్యేకు వివరించారు. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

బైక్, కారు ఢీ: వ్యక్తికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో నుజ్జయిన కారు ముందుభాగం


ప్రభుదాస్‌కు చికిత్స చేస్తున్న డాక్టర్ భాస్కర్

అడ్డతీగల: ఇక్కడికి శివారులోని టేకుప్లాంటేషన్ వద్ద శుక్రవారం బైక్–కారు ఢీకొన్న సంఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అడ్డతీగల నుంచి రంపచోడవరం వైపు వెళ్తున్న కారుని మారేడుమిల్లి నుంచి అడ్డతీగల వైపు వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో బైక్ నడుపుతున్న మారేడుమిల్లికి చెందిన ప్రభుదాస్ అనే యువకుడికి తీవ్రంగాను, మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఎల్లవరం పీహెచ్‌సీకి తరలించారు. వైద్యాధికారి భాస్కర్ వారికి తక్షణ వైద్యం అందించారు. ప్రభుదాస్‌ను మెరుగైన వైద్యానికి రాజమహేంద్రవరం తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవవరంలో పోలీసుల విస్తృత తనిఖీలు


దేవవరంలో తనిఖీలు కోసం వచ్చిన పోలీసులు

నక్కపల్లి : రెండు రోజుల క్రితం తుని మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు, టీడీపీ నేత పొల్నాటి శేషగిరిరావుపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనకు సంబంధించి నిందితుడ్ని పట్టుకునేందుకు శుక్రవారం పాయకరావుపేట, తుని పట్టణాలకు చెందిన పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. వేకువ జామునే సీఐలు, ఎస్‌ఐలతో కూడిన సుమారు 80 మంది పోలీసుల బృందం నక్కపల్లి మండలం దేవవరం, పాయకరావుపేట మండలం నామవరంలో సోదాలు నిర్వహించారు. ఉదయం ఐదుగంటలకే వాహనాల్లో పోలీసులు ఈ రెండు గ్రామాల్లో మోహరించడంతో ఏ జరుగుతుందో తెలియక ఈ రెండు గ్రామాల ప్రజలు ఆందోళనకు గురయ్యారు. టీడీపీ నేత శేషగిరిరావుపై గురువారం గుర్తు తెలియని ఒక వ్యక్తి కత్తితో హత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తి పరారయ్యాడు. అక్కడ నుంచి నామవరం వైపు మోటారు సైకిల్‌పై ఉడాయించినట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఉదయాన్నే ఈ రెండు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. దీనిపై పాయకరావుపేట సీఐ అప్పలరాజు వద్ద ప్రస్తావించగా శేషగిరిరావుపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఇటువైపు వచ్చినట్టు ఈ రెండు గ్రామాల్లో తలదాచుకునే అవకాశం ఉన్నట్టు సమాచారం రావడంతో కాకినాడ జిల్లా పోలీసులు, పాయకరావుపేట పోలీసుల సాయంతో దేవవరం, నామవరం గ్రామాల్లో నిఘా ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు.